
పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# ఆ కడపోళ్లకు కాస్త చెప్పండ్రా... "బాబు"

లేకపోతే... నెత్తిన తడిగుడ్డ వేయాల్సిందే



తార స్థాయికి కూటమిపార్టీల మధ్య పోరు

ఏక్కువైన ఆధిపత్యం

గ్రూపుల కొట్లాటలు

ప్రతి నియోజకవర్గంలో తప్పని కూటమి తిప్పలు

**కడప జిల్లాలోని కూటమి పార్టీలో విభేదాలు భగ్గుమంటున్నాయి. మద్యం, ఇసుక వ్యాపారాల్లో ఆధిపత్యం సాధించేందుకు మూడు పార్టీలు చేస్తున్న ప్రయత్నాలు వీధిన పడుతున్నాయి. ఇది ప్రతిపక్ష పార్టీకి లాభం చేకూర్చేరకంగా తయారయింది. కడప జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి పార్టీలు ఈసారి పది నియోజకవర్గాలకు గాను ఏడింటిలో గెలిపించారు. ప్రజలు కూటమి నేతలను అక్కున చేర్చుకున్నారు. అయితే గెలిచింది తమ ప్రతిభతోనేనన్న గర్వంతో పార్టీల నేతలు తమ అనుచరులకు లబ్ది చేకూర్చేందుకు రెడీ అయ్యారు. ఆదాయం వచ్చే ఏ పనినీ వదిలిపెట్టకుండా అందిన కాడికి దండుకునే ప్రయత్నాలను మొదలుపెడుతుండటంతో ఇప్పుడు టీడీపీకి కూడా ఇబ్బందికరంగా మారింది.**


**బ్యూరో రిపోర్ట్ పెన్‌పవర్, కడప జనవరి18:** ఆ మధ్య జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డికి, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డికి మధ్య ఫ్లైయాష్ వివాదం నడిచిన సంగతి తెలిసిందే. ఈ వివాదం ఇంతవరకూ సద్దుమణగలేదు. ఎవరి నియోజకవర్గంలో వారు ఇప్పటికే మద్యం దుకాణాలను తమ అనుచరులకు ఇప్పించుకోవడంలో సక్సెస్ అయ్యారు. అయితే ఇక్కడ టీడీపీదే సహజంగా పై చేయి కావడంతో జనసేన, బీజేపీ స్థానిక నేతలు గుర్రుమంటున్నారు. కనీసం తమకు అవకాశం ఇవ్వడం లేదని, ఎన్నికలప్పుడు తమ అవసరం కనిపించింది కానీ, వ్యాపారాలకు వచ్చే సరికి తాము కనిపించకుండా పోయామని జనసేన నేతలు ఆవేదనను బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు.

ఇక తెలుగుదేశం పార్టీలో కూడా సక్రమంగా ఉందంటే అదీ లేదు. అందులో కూడా గ్రూపుల కొట్లాటలు పార్టీని దెబ్బతీస్తున్నాయి. పార్టీ ప్రతిష్టను దిగజార్చడమే కాకుండా ఎందుకు గెలిపించామురా బాబూ అంటూ జనాలు అనుకునే పరిస్థితికి టీడీపీ నేతలే తీసుకువస్తున్నట్లు కనపడుతుంది. టీడీపీ నేతల్లో గ్రూపులుగా విడిపోయి మద్యం, ఇసుక వ్యాపారాల్లో తమ అనుచరులను భాగస్వామ్యులను చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు వికటించేలా ఉన్నాయి. అసలే అది జగన్ కు సొంత జిల్లా. అలాంటి చోట అధికారం వచ్చింది కదా? అని విర్రవీగితే మరోసారి వైసీపీ బలం పుంజుకునే అవకాశాలు లేకపోలేదన్న ఆందోళన తెలుగుదేశం పార్టీఅభిమానుల్లో వ్యక్తమవుతుంది. తాజాగా ఇసుక టెండర్లలో బీటెక్ రవి అనుచరులు స్థానిక టీడీపీ నేతలపైనే దౌర్జన్యానికి దిగడం చర్చనీయాంశమైంది. అంతేకాదు వారిని టెండర్లు వేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేయడంతో స్థానిక టీడీపీ నేతలు తిరగబడుతున్నారు. కడప ఎమ్మెల్యే మాధవి అనుచరులు, కమలాపురం ఎమ్మెల్యే అనుచరుల మధ్య కూడా ఇటీవల వివాదం చోటు చేసుకోవడం పార్టీ పరిస్థితిని అద్దం పడుతుంది. చివరకు రేషన్ షాపుల కేటాయింపులోనూ బీటెక్ రవి, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి వర్గీయుల మధ్య విభేదాలు తలెత్తాయి. ఇలా దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ఇలాగే ఉంది. ఇక ప్రొద్దుటూరులోనూ ఎవరి దారి వాళ్లదే. ఈరోజు చంద్రబాబు కడప జిల్లా పర్యటనకు వెళ్లారు. అక్కడ ప్రత్యేకంగా నేతలతో సమావేశమై వారిని క్రమశిక్షణలో పెట్టాలని పార్టీ అభిమానులు కోరుతున్నారు. లేకుంటే మరింత ఇబ్బందులు భవిష్యత్ లో తప్పవని హెచ్చరిస్తున్నారు.

## ప్రతినెలా మూడో శనివారం

# 'స్వచ్ఛ ఆంధ్ర' కోసం పని చేయాలి: సీఎం చంద్రబాబు

**'స్వచ్ఛ ఆంధ్ర' కోసం అందరూ కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. కడప జిల్లా మైదుకూరులో 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్'ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.**



**బ్యూరో రిపోర్ట్ పెన్‌పవర్, కడప జనవరి18:** "మన దేశం పరిశుభ్రంగా ఉండాలని గాంధీజీ తపించారు. ప్రధాని మోదీ సారథ్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టాం. పారిశుద్ధ్య సాధన దిశగా దేశ ప్రజలంతా చేతులు కలపాలి. జపాన్‌లో రోడ్లు కూడా ఎంతో పరిశుభ్రంగా ఉంటాయి. అక్కడ కాగితం కూడా జేబులో పెట్టుకుని ఇంట్లోని చెత్తబుట్టలో వేస్తారు. మనం మాత్రం ఇంట్లో ఉండే చెత్తను రోడ్డుపై పోస్తున్నాం. గతంలో ఏ ఊరు వెళ్లినా చెత్తాచెదారం కనిపించేది. గ్రామాల్లో మహిళల పరిస్థితి చూసి ఎంతో బాధపడేవాడిని. ఆరోజుల్లో వంట చేయడం మహిళలకు నరకంగా ఉండేది. దీపం కార్యక్రమం కింద ఆనాడు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం. ఇప్పుడు దీపం-2 కింద ఉచితంగా గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఆరోజు మేం ఇచ్చిన నివేదిక మేరకు స్వచ్ఛభారత్ కార్పొరేషన్ తెచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర కోసం సేవకులుగా పనిచేస్తామని చాలా మంది వచ్చారు. సమాజహితం కోసం కష్టపడేవారిని మనమంతా గుర్తించాలి. మైదుకూరులో సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టాం. ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కోసం పని చేయాలి. తరతరాలుగా వస్తున్న అలవాట్లు త్వరగా పోవు. మంచి అలవాట్లు పాటించేందుకు చాలా సమయం పడుతుంది. చెడు ఆలోచనలు, చెడు పనులు చేయకుండా మన మైండ్‌ను నిత్యం మనమే కంట్రోల్ చేయాలి. ఇల్లు, పరిసరాలు బాగుంటేనే మంచి ఆలోచనలు వస్తాయి. ఆహ్లాదకర వాతావరణం ఉంటేనే ఏదైనా సాధించగలం. పని ప్రాంతాన్ని కూడా అందరూ శుభ్రంగా ఉంచుకోవాలి" అని సీఎం సూచించారు.




# నదులు అనుసంధానం చేయడం నా కల

- రాయలసీమలో గోదావరి నీళ్లు పారిస్తా
- రతనాల సీమ గా మారుస్తా
- మైదుకూరు ఎన్టీఆర్ వర్ధంతి సభలో చంద్రబాబు ఉద్ఘాటన

**బ్యూరో రిపోర్ట్ పెన్‌పవర్, కడప జనవరి18:** గోదావరి-పెన్నా, పోలవరం - బనకచర్ల వరకు అనుసంధానం చేస్తే గేమ్ ఛేంజర్ గా తయారవుతుందని చంద్రబాబు అన్నారు. బనకచర్లకు గోదావరి నీళ్లు తీసుకురావడం నా జీవితాశయమని స్పష్టం చేశారు. తనను ఇంత వాడిని చేసిన సీమ ప్రజలకు నీళ్లు అందించి వారి తీర్చుకోవాలనేదే నా ఆలోచన అని పేర్కొన్నారు. మైదుకూరులో నేడు నిర్వహించిన ఎన్టీఆర్ వర్ధంతి సభలో పాల్గొన్న ఆయన ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తాను కూడా రాయలసీమ ప్రాంతానికి చెందిన వాడినేనని, తనకు రాయలసీమ సమస్యలపై పూర్తి అవగాహన ఉందంటూ చెప్పుకొచ్చారు చంద్రబాబు. రాయలసీమను రతనాలసీమగా మార్చే బాధ్యత నాడు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తీసుకున్నారని, ఆ తర్వాత అదే పంథాను తాను కొనసాగిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు. రెండేళ్లలో పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి, రాష్ట్రంలో సాగు, త్రాగునీరుకు ఇబ్బందులు లేకుండా చేస్తానంటూ సీఎం హామీ ఇచ్చారు. గాలేరు, నగరి, హంద్రీనీవాకు పునాదులు వేసింది ఎన్టీఆర్ అన్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకోవాలని చంద్రబాబు తెలిపారు. కాంగ్రెస్ సహా మిగిలిన ఏ పార్టీలు కడపకు చేసిందేమీ లేదని, టీడీపీ హయాంలోని కడప జిల్లా అభివృద్ధి పథంలో నడిచిందంటూ చంద్రబాబు అన్నారు.

తట్ట మట్టి కూడా ఎత్తని జగన్ : మాటలు చెప్పి ఎక్కడ ఒక తట్ట మట్టి కూడా పోయకుండా ఐదేళ్లు వైసీపీ పరిపాలన సాగిందని, అందుకే ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. రాబోయే ఎన్నికల్లో కడప జిల్లా క్లీన్ స్వీప్ కావాలంటూ కార్యకర్తలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. కార్యకర్తలు మరింత స్పీడ్ పెంచాలని, మొన్న ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు చరిత్రను తిరగ రాశాయని చంద్రబాబు అన్నారు. నదుల అనుసంధానం కు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అప్పుడే కరువు రహిత రాష్ట్రంగా ఏపీ గుర్తింపు పొందుతుందన్నారు.

పేదవాడి గుండెల్లో తీపి జ్ఞాపకం ఎన్టీఆర్ : తెలుగు జాతి చరిత్ర ఉన్నంత వరకూ తెలుగువారి గుండెల్లో ఉండే ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. అనుక్షణం తెలుగువారి ఆత్మగౌరవం కోసం తపించిన నాయకుడు అని పేర్కొన్నారు. వైఎస్ఆర్ జిల్లా ఎన్టీఆర్ అంటే మూడు అక్షరాలు కాదని అన్నారు. తెలుగువారి ఆత్మగౌరవం. పేదవాడి గుండెల్లో తీపి జ్ఞాపకం ఎన్టీఆర్ అని పేర్కొన్నారు.. ప్రభుత్వం అంటే పాలకులు కాదని, సేవకులని చెప్పిన ఏకైక నాయకుడు అన్న ఎన్టీఆర్ అని ప్రశంసలు కురిపించారు.. పేదవాళ్లకు పక్కా ఇళ్లు నిర్మించింది ఎన్టీఆర్ అని అన్నారు. బడుగు బలహీన వర్గాల గుండెల్లో చెరగని ధైర్యం అన్న ఎన్టీఆర్ అని పేర్కొన్నారు.. సంక్షేమానికి అర్థం తెచ్చారు. అభివృద్ధి అంటే చేసి చూపించారు. సంస్కరణలకు నాంది పలికిన యుగపురుషుడు ఆయన అంటూ అన్నారు.

నెలాఖరులోనే వాట్సప్ గవర్నెన్స్ సీఎం చంద్రబాబు : ఈ నెలాఖరులోనే వాట్సప్ గవర్నెన్స్ తీసుకొస్తున్నా. ఏ పని కావాలన్నా ఒక మెసేజ్ పెడితే చాలు. మీ సమస్యల పరిష్కారానికి ఆఫీసులకు వెళ్లే పనిలేదు. మీ ముందుకే వచ్చి సమస్యలు పరిష్కరించే ఏర్పాట్లు చేస్తున్నాం." అని ఈ సభలో చంద్రబాబు ప్రకటించారు..ఇది ఇలా ఉంటే ఎన్నికల అనంతరం సీఎం హోదాలో చంద్రబాబు తొలిసారిగా మైదుకూరుకు రావడంతో కూటమి నాయకులు, కార్యకర్తలు భారీగా మైదుకూరుకు భారీగా తరలివచ్చారు.. ఆయనకు అక్కడి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే మైదుకూరు నియోజకవర్గానికి సంబంధించి పలు హామీలను సైతం చంద్రబాబు సభ సాక్షిగా ప్రకటించారు.

# రెడ్డి సేవాసమితి సేవలు ప్రశంసనీయం






- జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి
- ఆం.ప్ర.ఉన్నత న్యాయస్థాన విశ్రాంత న్యాయమూర్తి
- పెన్ పవర్ దినపత్రిక ఆవిష్కరణ

**కడప, పెన్ పవర్ జనవరి 18:** పలు రంగాల్లో గొప్ప సేవలందిస్తున్న రెడ్డి సేవాసమితి సంస్థ నిర్వహణ ప్రశంసనీయమని ఆం.ప్ర. ఉన్నత న్యాయస్థాన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్.సి.వి.నాగార్జున రెడ్డి అన్నారు. కడపలోని డి.యస్.ఆర్ కళ్యాణమండపంలో శనివారం రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహింపబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ సి.వి.నాగార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రోలయవేమారెడ్డి మొదలుకొని నేటివరకు అనేకమంది రెడ్లు దేశానికి అనేక రంగాల్లో సేవలందించారన్నారు. తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి మొదలుకొని తెలుగునేలపై 11 మంది రెడ్లు ముఖ్యమంత్రులుగా సేవలందించారన్నారు. కార్యక్రమంలో ముందుగా 'మేలుకొలుపు' పెన్ పవర్ దినపత్రిక ,ప్రత్యేక సంచికలు , అతిథులచే ఆవిష్కరింపబడిరది. ప్రముఖ రచయిత పుత్తా పుల్లారెడ్డి రచించిన 'మహాభారత విజ్ఞాన సర్వస్వం'(4 సంపుటాలు) పుస్తకాన్ని ఆవిష్కరించి, పుల్లారెడ్డి గారికి 'సాహిత్య రత్నాకర' బిరుదు ప్రదానం చేశారు. విశిష్ట అతిథి, రాజంపేట శాసన సభ్యులు ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ రెడ్లలో అనేక రకాలు ఉన్నప్పటికీ ఐక్యతగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లాలో ఉన్న విశ్వవిద్యాలయానికి యోగి వేమన విశ్వవిద్యాలయం పేరు పెట్టడం గర్వకారణమన్నారు. సభాధ్యక్షులు, రెడ్డి సేవాసమితి అధ్యక్షులు ఆచార్య కుప్పిరెడ్డి నాగిరెడ్డి మాట్లాడుతూ సంస్థ ఆవిర్భావ వికాసాలను సభకు పరిచయం చేశారు. ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి నివేదక సమర్పిస్తూ సంస్థ పుట్టిన 25 ఏళ్లుగా వరద బాధితులు, కరోనా బాధితులు, పేద రైతులు, పేద విద్యార్థులకు చేసిన అనేక సేవా కార్యక్రమాలను సభకు తెలియజేశారు. ఆత్మీయ అతిథి, శాసనమండలి సభ్యులు ఎం.వి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పది మందికి అన్నం పెట్టే గుణం రెడ్లకుంటుందని, ఆ దిశగా సేవలందిస్తున్న రెడ్డి సేవాసమితి ఏర్పడడం రెడ్లకు ఎంతో తోడ్పాటన్నారు. ప్రత్యేక అతిథి, యోగి వేమన విశ్వవిద్యాలయం సహ ఆచార్యులు కొవ్వూరు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ గత పాతికేళ్లుగా విద్యావసతిని కల్పించి ఎంతోమంది విద్యార్థినులకు ఆశ్రయం కల్పిస్తున్న రెడ్డి సేవాసమితి సేవలు అభినందనీయమన్నారు. ప్రతి రెడ్డికి ఆత్మాభిమానంతోపాటు వినయం కూడా ఉండడం అవసరమన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు, హంస అవార్డు గ్రహీత డా.నరాల రామారెడ్డి మాట్లాడుతూ గతంలో తనను గండపెండేర సత్కారంతో సత్కరించిన సందర్భాన్ని గుర్తుకు చేశారు. రెడ్డి సేవాసమితి అభ్యుదయం దిశగా సేవలందించడం వెనుక నిర్వాహకుల కృషిని కొనియాడారు. ప్రత్యేక ఆహ్వానితులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు కసిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ వేమన పద్యాలు నాటి, నేటి, రేపటి సమాజానికి మార్గదర్శకాలన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు, ప్రముఖ జానపద పరిశోధకులు ఆచార్య చిగిచెర్ల కృష్ణారెడ్డి రాయలసీమ జానపద గేయాలను ఆలపించి సభను అలరింపజేశారు. ప్రత్యేక ఆహ్వానితులు కొండా లక్ష్మీకాంత రెడ్డి మాట్లాడుతూ రెడ్డి సేవా సమితి ఆవిర్భావం వెనుక సహకరించిన దాతలను సభకు తెలియజేశారు. యలమర్తి మధుసూదన్ వేమన పద్యాలను గానం చేశారు. వేమన పద్యపఠన పోటీల్లో విజేతలైన విద్యార్థులను నగదు బహుమతి, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. అతిథులను, 'మేలుకొలుపు' సంచిక సంపాదకులు డా.భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డా.చింతకుంట శివారెడ్డి, డా.వెల్లాల వెంకటేశ్వరాచారి, డా.అనుగూరు చంద్రశేఖరరెడ్డి, కొండూరు జనార్ధనరాజు, చదలవాడ వెంకటేశ్ లను, రెడ్డి సేవా సమితి సంస్థ అభివృద్ధికి తోడ్పడిన దాతలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. గుడ్ల ఆదినారాయణరెడ్డి వందన సమర్పణ చేశారు. వైయస్సార్‌జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి సభాసమన్వయం చేశారు. రాయలసీమ కోఆర్డినేటర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, తిరుపతి గీతా, కడప బిందు రెడ్డి, జస్టిస్ సివి నాగార్జున రెడ్డికి మహోన్నతమైన, అత్యద్భుతమైన, దాజీ రచించిన హార్ట్ ఫుల్ వే పుస్తకాన్ని , బహుకరించారు.పద్మప్రియ చంద్రారెడ్డి, కార్యవర్గ సభ్యులు, రెడ్డి ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.





